క్లుప్తంగా

జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ



వైఎస్సార్ జిల్లా విద్యాధికారిణి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకుంటున్న పవన్, యశ్వంత్

గుంతకల్లుటౌన్: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26న విద్యాశాఖ కడపలో నిర్వహించిన జోనల్‌స్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీల్లో స్థానిక రాజేంద్రప్రసాద్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వ్యాసరచన పోటీల్లో పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పవన్ మొదటిస్థానంలో నిలిచాడు. క్విజ్ పోటీల్లో టెన్త్‌క్లాస్ చదువుతున్న యశ్వంత్ విజేతగా నిలిచి జిల్లా విద్యాశాఖాధికారిణి మీనాక్షి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, బహుమతులను అందుకున్నారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను హెచ్‌ఎం నిర్మల్ కుమార్, గైడ్ టీచర్లు ఇమ్మానియేల్, రామ్మోహన్, మంజుల, రామకృష్ణమ్మ, రాఘవ, మల్లికార్జునరెడ్డి అభినందించారు.

పెరటి తోటల పెంపకం లాభదాయకం



ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి

బుక్కరాయసముద్రం: పెరటి తోటల పెంపకం ఎంతో లాభదాయకంగా ఉంటుందని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి సూచించారు. బుధవారం మండలంలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల టీచర్లు, సిబ్బందికి పెరటి తోటల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పరిసర ప్రాంతాల్లో నాణ్యమై కూరగాయలు పండించుకోవచ్చన్నారు. ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో పెరటి తోటలు సాగు చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. అనంతరం 10 ప్రభుత్వ పాఠశాలలకు 20 రకాల విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గృహ విజ్ఞాన శాస్త్రవేత్త సుధారాణి, సస్య రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్‌కుమార్ రెడ్డి, డాక్టర్ శశికళ, పాండు రంగ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖ అధికారి శైలజ

బుక్కరాయసముద్రం: రైతులు అరటి పంట సాగులో యాజమాన్య పద్ధతులు తప్పనిసరిగా పాటించాలని మండల ఉద్యానశాఖ అధికారి శైలజ సూచించారు. బుధవారం మండలంలోని నీలారెడ్డిపల్లిలో అరటి సాగులో మెలుకువలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు అరటి పంట సాగు చేసే సమయంలో నాణ్యమైన మొక్కలను ఎంచుకోవాలన్నారు. అరటి పంటలో సిగటోక తెగులు నివారణకు ప్రాపికొనజోల్ మందు లీటరు నీటికి 1 మిల్లీలీటర్ కలిపి టిల్ట్ స్ప్రేయింగ్ ద్వారా పిచికారీ చేయాలన్నారు. తామర పురుగు నివారణకు ఇమిడాక్రోఫిడ్ మందు పిచికారీ చేయాలన్నారు. అనంతరం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ మాధవి అరటి సాగులో ఎరువుల యాజమాన్యం, సూక్ష్మ పోషకాలపై అవగాహన కల్పించారు. బెల్ ఇంజక్షన్, గెలలకు సంచులు తొడగాలన్నారు. కార్యక్రమంలో ఐఎస్‌ఐ కంపెనీ ప్రతినిధి నరేంద్ర, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు కార్మికులకు మెమోలు



హాజరు పట్టికను పరిశీలిస్తున్న కమిషనర్ నయీమ్ అహ్మద్

గుంతకల్లుటౌన్: మున్సిపల్ సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పంప్‌హౌస్‌లో విధులకు గైర్హాజరైన వాటర్‌వర్క్స్ కార్మికులు అంజి, గోవిందు, పీరాకు మెమోలు జారీ చేయాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. బుధవారం ఉదయం కమిషనర్ ఎస్‌ఎస్. ట్యాంకు పంప్‌హౌస్‌లను పరిశీలించారు. సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేయగా ముగ్గురు కార్మికులు విధులకు హాజరు కాకపోవడంతో వారికి మెమోలివ్వాలన్నారు. అనంతరం ఆయన ట్యాంకుల్లో నీటి నిల్వలను పరిశీలించారు. తాగునీటిని శుద్ధి చేసి సరఫరా చేయాలని, పైప్‌లైన్ల లీకేజీలుంటే వెంటనే మరమ్మతు చేయాలని సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు.

వామ్మో.. కేబుల్ దొంగలు



సులువుగా డబ్బు సాధించాలనే అత్యాశతో కొందరు దుండగులు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి కాపర్ వైరు ఎత్తుకెళ్లడం, పొలాల్లోని మోటార్లకు చెందిన కేబుల్ చోరీ చేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో రైతులు సకాలంలో పంటలకు నీరందించలేక తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నెలలోనే 15 పొలాల్లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలుస్తోంది. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోతోందని అన్నదాతలు వాపోతున్నారు.

- పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలే టార్గెట్
- నష్టపోతున్న అన్నదాతలు



చందన గ్రామ సమీపంలో దుండగుల చేతిలో ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్లు (ఫైల్)

యాడికి: సాధారణంగా దొంగలు తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకుంటారు. అయితే దొంగలు కొత్త పంథాను ఎంచుకున్నారు. పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్ల వద్ద కేబుల్‌పై గురి పెట్టారు. మండలంలోని పొలాల్లో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు, రైతులు భయాందోళన చెందుతున్నారు. పొలాల్లో చోరీలపై ఫిర్యాదు చేసినా ఇంతవరకూ దుండగులను పోలీసులు పట్టుకోలేదని పలువురు రైతులు వాపోతున్నారు. రైతులు వేలాది రూపాయలు ఖర్చుచేసి పొలాల్లో ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్లను పగుల గొట్టి, అందులోని రాగి, అల్యూమినియం తీగలు, ఇతర సామగ్రిని దొంగలిస్తున్నారు. 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో 80 లీటర్ల ఆయిల్, 35 కిలోల వరకు రాగి తీగలు ఉంటాయి. మార్కెట్‌లో ఆయిల్ లీటర్ సగటున రూ.100, కిలో అల్యూమినియం రూ.350ల, రాగి కిలో రూ.1100 వరకూ పలుకుతోంది. అపహరించిన సామగ్రి ఆయిల్‌ను దుకాణాల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. యాడికి మండలంలోని చందన, రాయలచెరువు గ్రామాల్లో పంటలు సాగు సాగు చేసుకోవడానికి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం 6 వేర్వేరు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేశారు. చందన గ్రామంలో రాయలచెరువుకు పోయే రహదారిలో వ్యవసాయ బోరు బావుల వద్ద 25.12.2023, డిసెంబర్ 12న ఆరు ట్రాన్స్‌ఫార్మర్లు, మరో రెండు వారాల తర్వాత రాయలచెరువు గ్రామంలో మోడల్ స్కూల్ సమీపంలో ఓ రెండు ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి కాపర్ వైరు పట్టుకెళ్లడంతో పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆగంతకులు ఆచర్యకు పాల్పడి ఏడాది గడుస్తుండగా ఇప్పటి వరకు ఏడు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌లు మాత్రమే విద్యుత్ అధికారులు ఇచ్చారు. మరో రైతును తమ కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారు. సాగు చేసినపంటలు ఎండి పోతున్నాయని, రూ.లక్షల్లో నష్టం వాటిల్లుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూడు రోజుల్లో 15 బోర్ల వద్ద కేబుల్ అపహరణ

మండలంలోని దైవాలమడుగులో ఈ నెల 20న ఎనిమిది మంది రైతుల బోరుబావుల వద్ద, 22న ముగ్గురు రైతుల బోరుబావుల వద్ద , 25న నలుగురు రైతుల బోరుబావుల వద్ద కేబుల్ వైరును దొంగలించారు. గ్రామ సమీపం లో క్రిష్టిపాడుకు పోయే రహదారిలో రాత్రి పూట ఎవ్వరూ ఉండరని దొంగలు పడి ఇలా వరుసగా మూడు రోజులు కేబుల్ వైరును ఎత్తుకెళ్లారు. ఇటీవల తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణుడు దైవాలమడుగులో పర్యటించి బాధిత రైతులతో మాట్లాడారు. గ్రామాల్లో పోలీసులు గస్తీ నిర్వహించక పోవడంతోనే వరుసగా దొంగ తనాలు జరుగుతున్నాయని బాధిత రైతులు డీఎస్పీ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు.



దైవాలమడుగులో బాధిత రైతులతో మాట్లాడుతున్న తాడిపత్రి డీఎస్పీ (ఫైల్)

ఏడాది గడిచినా ట్రాన్స్‌ఫార్మర్ రాలేదు



గత ఏడాది డిసెంబర్ 25న నా తోటలో గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్ పగుల గొట్టి, అందులోని రాగి, ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూరైనట్లు చెబుతున్నారే గానీ.. ఇప్పటి వరకూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వలేదు. అధికారులు స్పందించి త్వరగా ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలి.

– మధు, రైతు, చందన గ్రామం

కేబుల్ చోరీ చేశారు



గ్రామ సమీపంలోని క్రిష్టిపాడుకు పోయే రహదారిలో ఉన్న 13 ఎకరాల వ్యవసాయ అరటి తోటలో ఉన్న కేబుల్ వైరును రెండు రోజుల క్రితం దుండగులు ఎత్తుకెళ్లారు. అరటి పంట ఎండిపోతుండడంతో రూ.35 వేలు ఖర్చు చేసి కేబుల్ మళ్లీ ఏర్పాటు చేసుకున్నాను. పోలీసులు గస్తీ నిర్వహించక పోవటంతోనే దొంగతనాలు జరుగుతున్నాయి.

– జి.నరసింహారెడ్డి, రైతు, దైవాలమడుగు

త్వరలో ఏర్పాటు చేస్తాం



రోడ్డుకు అనుకూలంగా ఉన్న తోటల్లోని సామగ్రిపై రాత్రి పూట దొంగలు టార్గెట్ చేస్తున్నారు. మండంలోని తోటల్లో ఎనిమిది విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ అయ్యాయి. వాటిలో ఏడు మంజూరు అవటంతో రైతులకు ఇచ్చాం. మరో ట్రాన్స్‌ఫార్మర్ వచ్చిన వెంటనే బాధిత రైతుకు అందజేస్తాం. చోరీలు జరగకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలి.

– రాజారావు, ఏఈ, యాడికి

'ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి'

పుట్లూరు: ఈ ఏడాది రబీలో పంటలను సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని వ్యవసాయ అధికారి కాత్యాయని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పొలం పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్‌తో సమీపంలోని రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు.

'రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి'

పెద్దవడుగూరు: భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు రామాంజనేయులు, వెంకటనారాయణ, కృష్ణ అన్నారు. బుధవారం పెద్దవడుగూరు లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ దినోత్సవం ఘనగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక పూజలు



గుత్తిలోని కాశీ విశ్వేశ్వర శివాలయంలో అభిషేకాలు చేస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని శివాలయాల్లో కార్తీక బుధవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కాశీ విశ్వేశ్వర దేవాలయం , నగరేశ్వరాలయం, నాగలింగేశ్వరాలయం, అయ్యప్ప ఆలయం, గౌతమేశ్వరాలయాలు భక్తులతో కిటకటలాడాయి. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

రేపు మాస శివరాత్రి వేడుకలు

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో శుక్రవారం మాస శివరాత్రి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. అందులో భాగంగా ఆ రోజు సాయంత్రం 6 గంటలకు అభిషేకార్చన, ప్రాకారోత్సవం, నంది పూజ వంటి ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. అనంతరం అల్పాహార వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు హాజరై స్వామివారి అనుగ్రహం పొందాలన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



గుత్తిలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ్ చారి

గుత్తి/గుంతకల్లు/గుంతకల్లు రూరల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని గుత్తి సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ చారి అన్నారు. గుత్తిలోని ఏపీ గురుకుల బాలికల పాఠశాలలో బుధవారం మండల న్యాయ సేవా సమితి చైర్మన్ శ్రీహరి ఆదేశాల మేరకు బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు జరుగుతాయన్నారు. బాలికల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. బాలికలను తల్లిదండ్రులు బాగా చదివించాలన్నారు. సీడీపీఓ ఢిల్లీశ్వరి, ప్రిన్సిపాల్ విజయలత, ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగేశ్వరి, న్యాయవాది గంగాధర్‌కుమార్, కోర్టు సిబ్బంది సాదిక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే గుంతకల్లులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాళ్లు సాలాబాయి, డాక్టర్ లక్ష్మయ్య, సోషల్ వెల్ఫేర్ మెంబర్ ఉమాదేవి, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ శివప్రసాద్, అధ్యాపకులు చంద్రమోహన్‌రెడ్డి, రాజయ్య, లత, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గుంతకల్లు మండలంలోని నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పావతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం బాల్య వివాహాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు.

హుండీ కానుకల లెక్కింపు

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపు బుధవారం నిర్వహించారు. అనంతపురం డివిజన్ పర్యవేక్షణ అధికారి ఎం.వన్నూరు స్వామి ఆధ్వర్యంలో హుండీలోని కానుకలు లెక్కించగా. రూ.8,58,283ల ఆదాయం వచ్చింది. గత ఏడాది హుండీ ఆదాయం రూ.6,09,886లు రాకా ఈ ఏడాది అదనంగా రూ.2,48,397 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఈఓ రామాంజినేయులు, అర్చకులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి పూజ



భజన చేస్తున్న అయ్యప్ప మాలధారులు

యల్లనూరు: మండల కేంద్రంలోని కోడిమూర్తి వెళ్లే ప్రధాన రహదారి చెరువు కట్ట వద్ద బుధవారం అయ్యప్పస్వామి కి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి సన్నిధిలో ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అయ్యప్ప మాలధారులు నృత్యాలు చేసుకుంటూ అయ్యప్ప పాటలను డారు. అనంతరం గ్రామంలో అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

యాడికి: మండలంలోని లక్షుంపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 6న మండలంలోని లక్షుంపల్లి గ్రామానికి చెందిన చలమారెడ్డి రాయలచెరువు రైల్వే గేటు వద్ద ఉన్న పెద్దపప్పూరు మండల కేంద్రంకు చెందిన నాగరాజును కులం పేరుతో దూషించాడు. దీంతో బుధవారం నాగరాజు యాడికి పోలీస్టేషన్‌లో చలమారెడ్డిపై ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు చలమారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పామిడి: పామిడి సమీపంలోని పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ రవిప్రసాద్, పోలీసులు ఇసుక ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా ఇసుక రవాణాదారులకు తహసీల్దార్ శ్రీధరమూర్తి అపరాధ రుసుం విధించారు.

ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలి



తాడిపత్రిలో ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎంవీఐలు, ఆర్టీసీ డీఎం

తాడిపత్రి అర్బన్: ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎంవీఐలు రాజగోపాల్, శ్రీనివాసులు సూచించారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో డీఎం శంకర్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంవీఐలు మాట్లాడుతూ ప్రతి ఆటోలో డ్రైవర్ సహా నలుగురే ప్రయాణించాలన్నారు. అధిక లోడుతో వెళ్తే ఆటోలను సీజ్ చేయడమే కాకుండా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆటోలలో వెనుకవైపు డోర్ తీసి కూర్చోవడం సరికాదన్నారు. ఆటో డ్రైవర్లు తమ పక్కన ప్రయాణికు లెవరినీ కూర్చోనివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు.

పుట్లూరు: ఆటో డ్రైవర్లు నిబంధనల మేరకు ప్రయాణికులను తరలించాలని ఎస్‌ఐ హేమాద్రి సూచించారు. బుధవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. డ్రైవర్ పక్కన ప్రయాణికులు ఉండరాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆటోలను నడిపి ప్రమాదాలకు కారణమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గార్లదిన్నె: ఆటోలు, బొలెరో వాహనాలు ఓవర్ లోడ్‌తో వెళ్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ గౌస్‌మహమ్మద్ బాషా హెచ్చరించారు.బుధవారం గార్లదిన్నె, తలగా చిపల్లి క్రాస్ సమీపంలో వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రికార్డులు సక్రమంగా లేని వాహనాలు, ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న వాహనాలకు జరిమానా విధించారు.

ఫిర్యాదులపై విచారణ

పామిడి: మండలంలోని కత్రిమల, నెమళ్లపల్లి, రామరాజుపల్లి గ్రామాల్లో బుధవారం తహసీల్దార్ ఎన్ శ్రీధరమూర్తి పర్యటించారు. కత్రిమల గ్రామ రైతు పుల్లన్న జిల్లా కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ అర్జీ మేరకు .. రైతు పొలానికి రస్తా విషయంపై ఇరుగుపొరుగు రైతులతో తహసీల్దార్ మాట్లాడారు. సర్వే చేపట్టగా ప్రభుత్వ స్థలం ఉన్నట్‌లెతై పులన్న పొలంకు రస్తా ఏర్పాటు చేయిస్తామన్నారు. అలాగే నెమళ్లపల్లిలో రైతు ఓబుళమ్మ రస్తా కోసం హైకోర్టు ఆశ్రయించడంపై ఆయన ఆగ్రామంలో పర్యటించారు. ఆ భూమికి సంబంధించి హైకోర్టులో కేసు నడుస్తున్నా.. ఆమె పక్కపొలం రైతు శివ 37 సెంట్ల ప్రభుత్వ రస్తా స్థలంలో చీనీచెట్ల పెంపకం చేపట్టడాన్ని తహసీల్దార్ గమనించారు. ప్రభుత్వ స్థలం గుండా రైతు ఓబుళమ్మకు రస్తా ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ అన్నారు. అదేవిధంగా రామరాజుపల్లిలో సర్వేనెంబర్ 28లోని దాదాపు 8 ఎకరాల ఇనామ్ భూమి అక్రమ విక్రయాలపై హైకోర్టు ఆశ్రయించడంపై సర్పంచ్ డీసీ ముత్యాల్‌రెడ్డి సారథ్యంలో తహసీల్దార్ గ్రామస్తులతో సమావేశమై ఇనామ్ భూమి పూర్వపరాలపై సమీక్షించారు.

వాడీవేడిగా మున్సిపల్ సమావేశం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ వన్నూర్‌బీ



సమస్యలు లేవనెత్తుతున్న మున్సిపల్ కౌన్సిలర్లు

గుత్తి: మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మున్సిపల్ సర్వ సభ్య సమావేశంతో పాటు బడ్జెట్ సమావేశం వాడీవేడిగా సాగింది. ఎప్పుడూలేనంతగా భారీ పోలీసు బందోబస్తు మధ్య కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్ బీ, కమిషనర్ జబ్బార్ మియా మధ్యాహ్నం 12.30 గంటలకు కౌన్సిల్ సమావేశం ప్రారంభించారు. ముందుగా బడ్జెట్ సమావేశాన్ని ఆమోదించారు. అనంతరం సర్వసభ్య సమావేశం ప్రారంభం నుంచే మున్సిపల్ కౌన్సిలర్లు పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. తాగునీరు, డ్రైనేజీ , సీసీ రోడ్లు వంటి సమస్యలపై మున్సిపల్ వైస్ చైర్మన్లు బిందె వరలక్ష్మి, పద్మలతారెడ్డితో పాటు కౌన్సిలర్లు వరదరాజులు, ఫరూక్, కేవీ రమణ, ఖాజా ఖాన్, నజీర్, అర వింద్, గద్దల రూతమ్మ, రాజేశ్వరి, లక్ష్మి రాణి, సులోచన, పుష్పావతి, మర్తాడు హసీనా, నరేష్ తదితరులు పైకి లేచి సమస్యలపై ధ్వజమెత్తారు. ప్రతి కౌన్సిల్ సమావేశంలో మేము సమస్యలను చెప్పడం మీరు వినడం నిత్య కృత్యమైందన్నారు. ఇంతవరకూ ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదన్నారు. మీ దృష్టికి తెచ్చిన సమస్యలను ఈ సారి పరిష్కారం చేయకపోతే పరిస్థితులు మరోలా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యురాలు కళ్యాణి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మ ప్రచారంలో భాగస్వాములు కావాలి



ప్రచారం చేస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: ధర్మ ప్రచారంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున కోరారు. బుధవారం మండలంలోని చెన్నంపల్లి, వెంకటాపురం గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమం నిర్వహించారు అయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవ చింతనలో అలవర్చుకోవాలన్నారు. తోటి వారికి సహాయ పడాలని, మోసం చేసే గుణం వీడాలన్నారు. భగవద్గీతలో ఉన్న ధర్మాలను ఆచరించాలన్నారు. అనంతరం జీవాత్మ, పరమాత్మలపై అవగాహన కల్పించి, కరపత్రాలు, పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామాంజినేయులు, శివ, సాయి, సుధాకర్, విజయ, నాగమణి, లక్ష్మీదేవి, నాగేశ్వరి, జాహ్నవి, ఇందిర, గగన్‌క్రిష్ణ, పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి

యాడికి: మండలంలోని ఎస్.తిమ్మాపురం, యాడికి గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పర్యటించారు. ముందుగా ఆయన మండలంలోని తిమ్మాపురం గ్రామంలో పర్యటించి గ్రామంలో అపరిశుభ్రత లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అనంతరం యాడికి మండలంలోని మార్కెట్ యార్డులో ఉన్న నీటి సంపును పరిశీలించారు. రాబోవు రోజుల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని సంబంధిత శాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. వేములపాడు రహదారిలో దీర్ఘ కాలంగా ఉన్న మురుగునీటి కుంటను తొలగించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహ సీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ వీర రాజు, సర్పంచు పందు అనురాధ, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పప్పుశనగకు లద్దె పురుగు బెడద



గుంతకల్లు మండలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్/యాడికి/గుత్తి రూరల్: గుంతకల్లు మండల వ్యాప్తంగా సాగు చేసిన పప్పుశనగ పంట ఇరవై రోజుల నుంచి నెల రోజుల దశలోఉందని, ఈ దశలో పంటకు లద్దెపురుగు ప్రమాదం పొంచి ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ స్వాతి సూచించారు. బుధవారం మండలంలోని పాతకొత్తచెరువు, దంచర్ల గ్రామాల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ రైతులకు పలు సూచనలు చేశారు. పప్పుశనగలో లద్దె పురుగు నివారణకు వేపనూనె పిచికారీ చేసుకోవాలన్నారు. అలాగే మొక్కజొన్న పంటను ఆశించి కత్తెర పురుగు, శనగ పచ్చ పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే పెద్దపప్పూరు మండంలోని నారాపురం,షేక్‌పల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ ఆంజనేయులు మాట్లాడుతూ రబీలో సాగు చేసిన పంటలకు ఈ క్రాప్ బుకింగ్, క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. డిసెంబర్ 15లోపు చెల్లించాలలన్నారు. వీహెచ్ఏ రవి తేజ, వీఏఏ రజని రైతులు పాల్గొన్నారు. అదేవిధంగా గుత్తి మండంలోని కొత్తపేటలో ఏఓముస్తాక్ అహ్మద్ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రబీలో వేరుశనగ, పప్పుశనగ, మొక్కజొన్న, జొన్న, వరి, ఉద్యాన పంటలైన టమాట, మామిడి పంటలు వేసుకున్న రైతులు కామన్ సర్వీస్ సెంటర్లలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. గుత్తి మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభించారని, పత్తి రైతులు రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ సూచించారు. కార్యక్రమంలో ఎంపీఈఓ అరుణ, ఇన్సూరెన్సు కంపెనీ ప్రతినిధి సురేంద్రబాబు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.